సాక్షి చిత్తూరు

ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023



భ్రమలు కల్పించొద్దు 'బాబు'!
తిరుపతి కల్చరల్: చంద్రబాబు మళ్లీ పేదలను మోసం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ఆరోపించారు. -IIలో



వెండి ఉరువుల అందజేత
శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శ్రీవల్లీ దేవసేన సమేత చెంగల్వరాయ స్వామికి వెండి ఉరువులు విరాళంగా అందజేశారు. -IIలో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	36	25
తిరుపతి	37	26
తిరుమల	31	21
గూడూరు	37	27
నగరి	37	26

న్యూస్‌రీల్

న్యాయశాఖ ఉద్యోగుల సమావేశం నేడు

చిత్తూరు అర్బన్: ఉమ్మడి జిల్లా పరిధిలోని న్యాయశాఖ ఉద్యోగుల సంఘ సమావేశాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ నగరంలోని పాత జిల్లా కోర్టు ఆవరణంలో ఉన్న బార్ అసోసియేషన్ భవనంలో ఉదయం 11.30 గంటలకు సమావేశం ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

29న కాణిపాకం ఆలయ కమిటీ సమావేశం

కాణిపాకం(యాదమరి):కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పాలక మండలి సమావేశాన్ని ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్నట్లు చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరుకావాలని స్పష్టం చేశారు.

27న పశువుల పరుష వేలం

పుంగనూరు: పట్టణంలోని మాణిక్య వరదరాజ స్వామి రథోత్సవ పశువుల పరుష నిర్వహణ వేలాన్ని ఈనెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు ఏసీ ఏకాంబరం తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న వేలంలో పాల్గొనే వారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలని సూచించారు. వేలం ఖరారు కాగానే పూర్తి డబ్బు చెల్లించాలని స్పష్టం చేశారు.


నిత్యాన్నదానానికి కర్ణాటక ఎమ్మెల్యే అభ్యర్థి విరాళం



ఆలయ చైర్మన్‌కు విరాళం అందిస్తున్న దాత రఘునాథనాయుడు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కర్ణాటక ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి రఘునాథనాయుడు రూ.లక్ష విరాళం అందించారు. ఐరాల మండలం కస్తూరి నాయన పల్లెకు చెందిన ఆయన బెంగళూరు సిటీ పద్మనాభ నగర్ 171లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. శనివారం ఉదయం వినాయక స్వామి దర్శనానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం విరాళాన్ని దాత అందించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్ర బాబు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.

ఆఫీసర్స్ క్లబ్ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్, పక్కన ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ :నగరంలోని ఆఫీసర్స్ క్లబ్‌ను అభివృద్ధికి కృషి చేస్తామని క్లబ్ అధ్యక్షుడు, కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. శనివారం క్లబ్‌ను సందర్శించిన ఆయనకు సభ్యులు పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలికారు. కలెక్టర్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. ఈ నెల 27వ తేదీన క్లబ్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి మాట్లాడుతూ మేధావి వర్గం ప్రాతినిధ్యం వహించే చిత్తూరు ఆఫీసర్స్ క్లబ్ జిల్లాకే గర్వకారణమన్నారు. క్లబ్ సభ్యులు రవి, నరసింహారెడ్డి, రామకృష్ణారెడ్డి, టీవీఎస్ నాయుడు, ఆనందరెడ్డి, సీఆర్ మహేష్ పాల్గొన్నారు.

జలం.. పుష్కలం

జిల్లాలో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నాయి.. నాలుగేళ్లుగా వరుణుడి కరుణతో భూగర్భజలాలు పెరిగాయి.. నిండు వేసవిలో సైతం జలాశయాలు కళకళలాడుతున్నాయి.. ఎండలు మండుతున్నా.. వాగులు.. వంకలు ప్రవహిస్తున్నాయి.. అయినప్పటికీ అధికార యంత్రాంగం అప్రమత్తంగానే ఉంది.. ఒక్క గొంతు కూడా ఎండకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది.. తాగునీటి కటకట తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది.. రక్షిత పథకాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసేలా చర్యలు చేపడుతోంది.. పనిచేయని బోర్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయిస్తోంది. ప్రభుత్వ చిత్తశుద్ధిపై ప్రజానీకం హర్షాతిరేకం వ్యక్తం చేస్తోంది.. ఇది కదా సుపరిపాలన అని కొనియాడుతోంది.

- జిల్లాలో అవసరాలకు తగ్గట్టు నీటి నిల్వలు
- పెరిగిన భూగర్భ జలమట్టం
- వేసవిలో ఇబ్బందులు తలెత్తకుండా అధికారుల ముందస్తు ఏర్పాట్లు
- ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న కలెక్టర్
- సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్ : 0857 2233898

జిల్లా సమాచారం	
మొత్తం మండలాలు	పంచాయతీలు
31	697
ఓవర్ హెడ్ ట్యాంకులు	గ్రౌండ్ లెవల్ ట్యాంకులు
2,862	693
అందుబాటులో ఉన్న నీటి సరఫరా ట్యాంకులు	
3,555	

సాక్షి, చిత్తూరు : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుండి వరుణుడి కరుణ ప్రభుత్వంపై ఉంది. ఈ నాలుగేళ్లలో వర్షపాతం సాధారణం కంటే రెట్టింపు స్థాయిలో కురిసింది. ఫలితంగా భూ గర్భజలాలు అపారంగా ఉన్నాయి. చెరువులు, నదుల్లో నీరు పుష్కలంగా ఉన్నాయి. నిండు వేసవిలోనూ వాగులు, వంకలు ప్రవహిస్తుండటం విశేషం.

అయితే, ఎండలు మండుతున్న వేళ నీటి ఇబ్బందులు తలెత్తకుండా చిత్తూరు జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. జిల్లాలో మొత్తం 3555 నీటి ట్యాంకులు నుండి రక్షిత మంచినీటిని సరఫరా చేస్తోంది. ఏదైనా గ్రామాల్లో బోర్లు రిపేరు ఉంటే తక్షణమే మరమ్మతులు చేపడుతూ జనానికి నీటి కష్టాలు ఎదురవకుండా చర్యలు చేపడుతోంది.

గత టీడీపీ ప్రభుత్వంలో వేసవి వచ్చిందంటే తాగునీటి కోసం ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడేవారు. సకాలంలో వర్షాలు కురవక కరువు పరిస్థితుల్లో కొట్టుమిట్టాడేవారు. గ్రామీణ ప్రాంతాల్లో బోర్లు పనిచేయక పొలాల వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకునేవారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వాతావరణ పరిస్థితుల్లో పూర్తి మార్పు వచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వరుణుడి కరుణ లభించింది. దాదాపు నాలుగేళ్లుగా సాధారణ వర్షపాతానికి మించి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో భూగర్భజలాలు అపారంగా పెరిగాయి. జిల్లా సాధారణ వర్షపాతం 1,392 మిల్లీమీటర్లు కాగా, గత ఏడాది 68% ఎక్కువగా నమోదైంది. ఈ ఏడాది కూడా మార్చి నాటికి 914 మిల్లీమీటర్ల వర్షం కురవడం గమనార్హం. దీంతో గతంలో వాల్టా పరిధిలో నిషేధం కింద 200 గ్రామాలు ఉంటే, ప్రస్తుతం 6 గ్రామాలు మాత్రమే జాబితాలో ఉన్నాయి.

అందుబాటులో భూగర్భ జలాలు

జిల్లావ్యాప్తంగా భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం కుప్పం ప్రాంతంలో 18.7 మీటర్లలోనే నీరు పడుతోంది. గుడుపల్లెలో 17.2, గంగవరంలో 12.9, పెనుమూరులో 11, వి.కోటలో 10.3 మీటర్లలోనే జలాలు ఉన్నాయి. మిగిలిన అన్ని మండలాల్లో 10 మీటర్ల కన్నా తక్కువ స్థాయిలోనే నీరు లభ్యం కావటం విశేషం. దీంతో నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తడంలేదు.

సాంకేతిక సమస్యలు ఉంటే తప్ప నీటి నిల్వలు తగ్గే అవకాశం లేదని నిపుణులు సైతం వెల్లడిస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో నీటి సరఫరాపై ఎటువంటి ఫిర్యాదులు రాలేదని అధికారులు చెబుతున్నారు. తాత్కాలికంగా ఎక్కడైనా గ్రామాల్లో బోర్లు మరమ్మతులకు గురైతే వెంటనే మరమ్మతులు చేయిస్తున్నారు. ఈ మేరకు కలెక్టర్ స్పష్టంగా ఆదేశాలు జారీ చేశారు.

నిత్యం పర్యవేక్షణ

జిల్లాలో తాగునీటి కటకట రాకుండా కలెక్టర్ సగిలి షణ్మోహన్ , జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు నిత్యం సమీక్షిస్తున్నారు. అందులో భాగంగా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడైనా నీటి సరఫరా వ్యవస్థ దెబ్బతింటే ప్రత్యామ్నాయ మార్గాల ఎంపిక చేసుకోవాలని స్పష్టం చేశారు. రక్షిత నీటి పథకాల ట్యాంకులను ప్రతి 15రోజులకు ఒకసారి తప్పనిసరిగా శుభ్రం చేయించాలని సూచించారు. ఈమేరకు నీటి సరఫరా, పంచాయతీ విభాగాలను అప్రమత్తం చేశారు.



ఎప్పటికప్పుడు అంచనా



జిల్లాలో నీటి నిల్వలపై ఎప్పటికప్పుడు అంచనాలు వేస్తున్నాం. పరిస్థితిని క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నాం. ఈ మేరకు కలెక్టర్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులకు నివేదికలు అందిస్తున్నాం. వాల్టా పరిధిలోని ఆరు గ్రామాల్లో సైతం ప్రజాప్రయోజనాల కింద బోర్లు వేసుకునే వెసులుబాటు కల్పించాం. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా నీటి ఎద్దడి లేదు. సమృద్ధిగా భూగర్భజలాలు ఉన్నాయి.

– శంకరయ్య , డీడీ, గ్రౌండ్ వాటర్

నీటి సరఫరా పర్యవేక్షణ



జిల్లావ్యాప్తంగా తాగునీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ఎక్కడైనా మోటార్లకు సమస్య వస్తే వెంటనే మరమ్మతులు చేయిస్తున్నాం. ఓవర్ హెడ్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చర్యలు చేపట్టాం. పంచాయతీ సిబ్బంది, గ్రామీణ నీటి సరఫరా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ఎక్కడా ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకున్నాం.

– లక్ష్మి, డీపీఓ, చిత్తూరు

వరుణుడి కరుణ ఉంది



వైఎస్ కుటుంబానికి వరుణుడి కరుణ ఉంది. సకాలంలో వర్షాలు కురవడంతో నీటి ఎద్దడి లేదు. మా గ్రామంలో ఆరు బోర్లు ఉంటే అన్నీ బాగా పనిచేస్తున్నాయి. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నీటి సమస్య రాలేదు. వేసవిలో సైతం నీరు పుష్కలంగా ఉంది.

– దీప్తి గాయత్రి, సర్పంచ్, మొగిలి వెంకటగిరి, బంగారుపాళ్యం మండలం

నీటి కొరత లేదు



మా గ్రామంలో నీటి నిల్వ సామర్థ్యం తక్కువగా ఉండడం వల్ల వాల్టా చట్టం పరిధిలో ఉంచారు. అయినప్పటికీ గత నాలుగేళ్లుగా నీటి కొరత లేదు. చంద్రబాబు, కరువు కవల పిల్లలు కాబట్టే గతంలో తాగునీటికి ఇక్కట్లు పడేవాళ్లం. ఇప్పుడు మా ఊళ్లోని 18 బోర్లు చక్కగా పనిచేస్తున్నాయి. సమృద్ధిగా నీరు దొరుకుతోంది. మాకు సంతోషంగా ఉంది.

– సుశీల, సొడిగానిపల్లె, గుడుపల్లె మండలం

మంత్రి పెద్దిరెడ్డి చొరవతో..



వేసవిలో మా గ్రామస్తులు ఎలాంటి ఇబ్బంది పడకుండా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చర్యలు చేపట్టారు. ఆయన సహకారంతో తాగునీటి సరఫరాకు కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేశాం. ఒకవేళ ఏదైనా సమస్య తలెత్తినా, ప్రజలు అవస్థ పడకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకున్నాం. జగనన్న పాలనలో వర్షాలు పుష్కలంగా కురవడంతో మాకు శ్రమ తప్పింది. – రాణి, సర్పంచ్, పులిచెర్ల, పులిచెర్ల మండలం

పకడ్బందీ చర్యలు



వేసవి నేపథ్యంలో ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాం. జిల్లాలో భూగర్భజలాలు పుష్కలంగా ఉండడం కూడా కలిసి వచ్చింది. నీటి లభ్యతపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. వివిధ శాఖలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. క్షేత్రస్థాయిలో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నాం. అలాగే కాల్ సెంటర్ కూడా ఏర్పాటు చేశాం.

– షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు

ఆవులపల్లె ప్రాజెక్టు పనుల పరిశీలన



ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

సోమల: మండలంలోని ఆవులపల్లె సమీపంలో సీతమ్మ చెరువు వద్ద నిర్మిస్తున్న ప్రాజెక్టును మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ సుమారు రూ. 800 కోట్ల వ్యయంతో 3.5 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నిర్మిస్తున్న ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పృథ్వీరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చ

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో సాగుతున్న అభివృద్ధి పనులపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు చర్చించారు. శనివారం తిరుపతిలోని మంత్రి నివాసంలో ఆయన కలిసి పలు అంశాలను వివరించారు.

అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యం



మత్స్యకారులకు బైక్‌లు, ఐస్ బాక్స్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం : రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. శనివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మత్స్యకారులకు మోటార్‌సైకిల్, ఐస్‌బాక్స్‌లను పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలోని మత్స్యకారులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమివ్వడం ఆనందంగా ఉందన్నారు. చేపలు విక్రయించుకునేందుకు వీలుగా 40శాతం సబ్సిడీపై బైక్‌లు అందించడం అభినందనీయమని తెలిపారు. చేపల నిల్వ చేసుకునేందుకు ఐస్ బాక్స్‌లు పంపిణీ చేశామని వెల్లడించారు. ప్రభుత్వం అందించిన అవకాశాన్ని మత్స్యకారులు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శరవణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మురుగేష్, కౌన్సిలర్ మునిరాజ్, సర్పంచ్ మురుగేష్ పాల్గొన్నారు.

'కాడెద్దులు' కనుమరుగు!

ఒకప్పుడు దుక్కి దున్నాలన్నా.. విత్తు వేయాలన్నా.. పండించిన పంట ఇంటికి చేరాలన్నా.. కాడెద్దులు.. ఎడ్లబండి కావాల్సిందే. వ్యవసాయంలో వాటి పాత్ర చాలా కీలకంగా ఉండేది.. ఇప్పుడు యాంత్రీకరణ నేపథ్యంలో ట్రాక్టర్లు ఇతర పరికరాలు అందుబాటులోకి వచ్చేశాయి. ఈ క్రమంలో ఎడ్లబండి జాడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇక కాడెద్దులు అనేవి చూద్దామన్నా కానరాని పరిస్థితి ఏర్పడుతోంది. కొన్ని గ్రామాల్లో ఒకటి.. రెండూ కనిపిస్తూ నాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తున్నాయి. ఇక పశువుల్లో సైతం సీమజాతి ఆవులు రాజ్యమేలుతుండడంతో కోడె గిత్తలు కనుమరుగవుతున్నాయి. ఈ తరుణంలో జోడెద్దులను ఎవరైనా కొనుగోలు చేయాలన్నా ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. గతంలో రైతుకు వెన్నుదన్నుగా నిలిచిన ఎడ్లు..బండ్లు నేడు ఉనికిని కోల్పోతున్నాయి.

- పదేళ్లలో భారీగా తగ్గిన దేశవాళీ పశువులు
- వ్యవసాయ యాంత్రీకరణతో మూలన పడిన ఎడ్ల బండ్లు
- ఇప్పుడిప్పుడే ఎద్దులకు పెరుగుతున్న డిమాండ్
- జత కొనాలంటే రూ.లక్ష వరకు ధర





ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన ఎడ్ల బండి (ఇన్‌సెట్) తమిళనాడు నుంచి రైతులు కొనుగోలు చేసిన ఎద్దులు

పలమనేరు : గతంలో ప్రతి రైతు ఇంటి వద్ద కాడెద్దులు, ఎడ్లబండి దర్శనమిచ్చేవి. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ట్రాక్టర్ల రాకతో కాడెద్దులు, బండ్లు కనుమరుగయ్యాయి. ప్రస్తుతం గ్రామానికి ఏ ఒక్కరో ఇద్దరో రైతుల వద్ద మాత్రమే ఎద్దులు కనిపిస్తున్నాయి. ఇక ఎడ్లబండ్లు మచ్చుకైనా కానరావడం లేదు. మారుమూల గ్రామాల్లో ఉన్న ఒకటి రెండు బండ్లు నాటి జ్ఞాపకాలకు గుర్తులుగా దర్శనమిస్తున్నాయి.

రైతుకు అండగా..

నాడు వ్యవసాయంలో కాడెద్దులు, ఎడ్లబండి ముఖ్య భూమికను పోషించేవి. సాగులో రైతుకు అండగా నిలిచేవి. ఏటా వేరుశనగ పంటకు దుక్కులు దున్నేందుకు, విత్తనాలు వేసేందుకు కాడెద్దులు ఉండాల్సిందే. అసలు ఎద్దులు, మడక, ఎడ్లబండి లేని రైతు కుటుంబాలు ఉండేవి కాదు. ఇప్పటికీ వీటికి డిమాండ్ ఉన్నా మారిన వ్యవసాయ పరిస్థితులతో వీటి ఉనికి కరువైంది. ఇన్నాళ్లు కాడెద్దులతో వేరుశనగ విత్తనాలు వేసేవారు. ఇప్పుడు యంత్రాల రాకతో వీటితో పనిలేకుండా పోయింది. ప్రస్తుతం సీమ జాతి పశువులతో పాల ఉత్పత్తి ద్వారా మంచి గిట్టుబాటు ఉండడంతో దేశవాళీ జాతులకు తగ్గుతున్నాయి. ఒక్క పలమనేరు డివిజన్‌లోనే పదేళ్ల క్రితం దేశవాళీ పశువులు పది లక్షల వరకు ఉండేవి. ప్రస్తుతం వాటి సంఖ్య 60వేలకు పడిపోయింది. అందులో ఎద్దు అయితే పదుల సంఖ్యకే పరిమితమయ్యాయి. ఇక ఎడ్ల బండ్లు దాదాపు 200 మాత్రమే ఉన్నట్లు అంచనా. అందులోనూ 150 వరకు మూలనపడ్డాయి.

కనుమరుగుకు కారణాలివే..

హెచ్‌ఎఫ్, జెర్సీ తదితర ఆవులు పెరగడంతో నాటు జాతులపై రైతులు ఆసక్తి చూపడం లేదు. ఇందుకు గతంలోని కరువు పరిస్థితులు కూడా ఓ కారణంగా చెప్పవచ్చు. సక్రమంగా వర్షాలు లేక పంటల సాగు తగ్గడంతో రైతులకు ఎద్దుల అవసరం లేకుండా పోయింది. వేసవిలో వీటికి మేత సమస్య కూడా ఉత్పన్నం కావడంతో పోషణ భారంగా మారింది. దీంతో పాడి ఆవుల సంఖ్య పెరిగే కొద్దీ కోడె గిత్తలు, ఎడ్లు క్రమేణా తగ్గిపోయాయి. కరువు కాటకాల నేపథ్యంలో నాటు జాతులు కబేళాల పాలయ్యాయి.

ఎద్దులకు పెరుగుతున్న డిమాండ్

కాడెద్దుల సంఖ్య తగ్గిపోవడంతో ప్రస్తుతం డిమాండ్ భారీగా పెరుగుతోంది. మేలు జాతి ఎడ్లు జత కొనుగోలు చేయాలంటే రూ.70వేల నుంచి రూ.లక్ష వెచ్చించాల్సిందే. అవి కూడా పుంగనూరు, పలమనేరు, గట్టు, బొడుమాకులపల్లె వారపు సంతల్లో మాత్రమే కనిపిస్తున్నాయి. తమిళనాడులోని పాయి, బొరుగూరు, వేలూరు ప్రాంతాల్లో జరిగే సంతల్లో బలిష్టమైన కాడెద్దులు విక్రయానికి వస్తున్నాయి. ముఖ్యంగా వేరుశనగ విత్తనాలు విత్తేందుకు ఎద్దుల మడకకు ఇప్పటికీ డిమాండ్ ఎక్కువగా ఉండడం విశేషం. మడకతో దున్నే దుక్కి ఉన్నట్టు యంత్రాలతోనూ రాదని రైతులు చెప్పే మాట. ఏదేమైనా గతంలో పల్లెల్లో ఓ వెలుగు వెలిగిన కాడెద్దులు, ఎడ్లబండి, కాడె, మడకలు నేడు కనుమరుగవుతుండడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వందేళ్లు వర్ధిల్లు నాయనా



సీఎం వైఎస్ జగన్ చిత్రాన్ని ప్రేమగా చూస్తున్న వృద్ధురాలు నాగమ్మ

పాలసముద్రం : ''మా ఆశ.. శ్వాస నువ్వే జగన్.. మీ తండ్రి రాజన్నకు మించి మాకు మంచి చేస్తున్నావు.. మాలాంటి వృద్ధులకు అండగా నిలిచావు.. ఇన్నేళ్ల జీవితంలో ఇచ్చిన మాటకు కట్టుబడిన నాయకుడిని నిన్నే చూస్తున్నా.. వందేళ్లు చల్లగా వర్ధిల్లు నాయనా'' అంటూ రాచపాళెం గ్రామానికి చెందిన వృద్ధురాలు నాగమ్మ ఆశీర్వదించారు. మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌లోని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రాన్ని చూసి అభిమానం ప్రదర్శించారు. శనివారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా తన ఇంటికి వచ్చిన సచివాలయ కన్వీనర్, గృహసారథులు ఇచ్చిన స్టిక్కర్‌ను తీసుకుని ఆమె ఆనందపడ్డారు. మళ్లీ నువ్వే అధికారంలోకి రావాలి జగనయ్యా అంటూ ఆకాంక్షించారు.

దళితులను అవమానించడం దారుణం

● ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



లోకేష్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: దళితులను అవమానించడం దారుణమని, అలాంటి వారికి పుట్టగతులుండవని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద మండిపడ్డారు. శనివారం నగరంలో నారా లోకేష్ దిష్టిబొమ్మను దహనం చేశారు. వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లా డోన్ నియోజకవర్గంలో ఎస్సీలతో ఏర్పాటు చేసిన లోకేష్ మాట్లాడుతూ దళితులను హేళన చేయడం సరికాదన్నారు. దళితులుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా అని గతంలో చంద్రబాబు వ్యాఖ్యానించారని, యువగళం పాదయాత్రలో లోకేష్ మరింత తక్కువ చేసి మాట్లాడారని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో దళితులకు పెద్దపీట వేస్తున్నారని వెల్లడించారు. రిజర్వేషన్ ప్రకారం వారికి పదవులు ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, కార్పొరేటర్ హరిణిరెడ్డి, సర్పంచ్ అమర్‌నాథరెడ్డి, నాయకులు భూపేష్ గోపినాథ్, శ్రీధర్‌రెడ్డి, లోకేష్, నారాయణ, రాజా పాల్గొన్నారు.

దళిత సత్రానికి స్థలం కోసం ఆందోళన



పోస్టర్ విడుదల చేస్తున్న దళిత ఉభయదారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద దళిత సత్రం నిర్మాణానికి స్థలం కేటాయించకుంటే ధర్నాకు దిగుతామని దళిత ఉభయదారులు హెచ్చరించారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడారు. 2002లో ఆలయం పక్కనే దళిత సత్రం కోసం స్థలం ఇచ్చారని, తర్వాత ఆలయ అభివృద్ధికి సదరు భూమిని దేవదాయశాఖ స్వాధీనం చేసుకుందన్నారు. తర్వాత అధికారులు దాదాపు 700 మీటర్ల దూరంలో స్థలం కేటాయించి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయం సమీపంలోనే స్థలం ఇవ్వాలని పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ఈఓ వెంకటేశు స్పందించి తమకు న్యాయం చేయకుంటే ఈ నెల 27వ తేదీన ధర్నాకు దిగుతామని స్పష్టం చేశారు. అనంతరం ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు.

కర్ణాటక మద్యం విక్రేతల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: నగరంలోని పాతబస్టాండు వద్ద కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని సెబ్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. నిందితులు మురళీకుమార్(54), మణి(35)నుంచి 180 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. దాడిలో సీఐలు జోగేంద్ర, వెంకటలక్ష్మి, ఎస్ఐ బాబు పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో బాలుడి అరెస్ట్

గంగవరం : బాలికపై లైంగికదాడి కేసులో నిందితుడిని శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని కొత్తపల్లెకు చెందిన మైనర్ బాలికను బంగారుపాళ్యం మండలం పెరుమాళ్లపల్లెకు చెందిన ఓ బాలుడు మాయమాటలు చెప్పి బెంగళూరు, గోవా, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ఎట్టకేలకు శనివారం అదుపులోకి తీసుకున్నారు. తిరుపతిలోని జువైనల్ హోమ్‌కు తరలించారు.

భ్రమలు కల్పించొద్దు 'బాబు'!

తిరుపతి కల్చరల్: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తన పుట్టిన రోజున పేదలను కోటీశ్వరులను చేసే పథకం అంటూ ప్రకటన చేయడం వారిని ఫూల్ చేయడమేనని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం విమర్శించారు. శనివారం తిరుపతిలోని తన కార్యాలయంలో ఆయన మట్లాడారు. ఊకదంపుడు ఉపన్యాసాలు, వీడియో కాన్ఫరెన్స్‌లు, మార్కెటింగ్ మాయాజాలంతో రాష్ట్రం మరో సింగపూర్ అయినట్లు భ్రమలు కల్పించడంలో టీడీపీ పీహెచ్‌డీ చేసిందన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసినా ఆంధ్రలో 65 శాతం పేదలు ఉండిపోయారంటే బాబు మాయాజాలం ఏపాటిదో అర్థమవుతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలతో లక్షల రూపాయలను ప్రతి పేద కుటుంబానికీ అందించారని గుర్తుచేశారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన చంద్రబాబుకు ఇప్పుడు ఓట్లు అడిగే హక్కు లేదని స్పష్టం చేశారు.

ద్రవిడ వర్సిటీ రిజిస్ట్రార్ అరెస్ట్‌కు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీ, దళిత సంఘాల నేతలు

రామకుప్పం: ద్రవిడ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వేణుగోపాల్ రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని ఎస్టీ, దళిత సంఘాల నేతలు శనివారం డిమాండ్ చేశారు. మండలంలోని ఆకందగానిపల్లెలో వారు విలేకర్లతో మాట్లాడారు. వర్సిటీలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతికి గిరిజన నేతలకు ఆహ్వానించకపోవడం దారుణమన్నారు. ప్రశ్నించిన సర్పంచ్ మోహన్‌నాయక్‌ను కులంపేరుతో దూషించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మండిపడ్డారు. దీనిపై పోలీసులు వెంటనే స్పందించి రిజిస్ట్రార్‌ను అరెస్ట్ చేయాలని కోరారు. లేకుంటే వర్సిటీని ముట్టడిస్తామని, గవర్నర్, ఎస్సీ, ఎస్టీ కమిషన్, లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భారతీయ అంబేడ్కర్ సేన నేత బుర్రా సతీష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, ఎస్టీ సంఘాల నేతలు నాగభూషణం నాయక్, భాస్కర్ నాయక్, రెస్కో డైరెక్టర్ థామస్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, నేతలు రాంబాబు, మురుగేష్, నారాయణ, చిన్నరాజునాయక్ పాల్గొన్నారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,200
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.78

వెండి ఉరువుల అందజేత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి వేదస్థానంలోని శ్రీవళ్లి దేవసేన సమేత చెంగల్వరాయ స్వామికి హైదరాబాద్‌వాసి, అజస్ర హోం ప్రైవేట్ లిమిటెడ్ అధినేత ఎస్.రామకృష్ణారావు శనివారం వెండి ఉరువులు అందజేశారు. ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులుకు ఆయన రూ.18,30,000 విలువైన వెండి ఆభరణాలు అందజేశారు. స్వామి,అమ్మవార్లకు అలంకరించేందు వీటిని వినియోగించనున్నారు. దేవస్థానం అభిషేక గురుకుల్, రాజేష్ గురుకుల్, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, ఆలయాధికారి దాము, పరిచారకులు మహేష్ పాల్గొన్నారు.

వైరల్

అమ్మాజీ... కదిలించావు!

ఒక సిటీలో ఒక మహిళ రోడ్డు పక్కన ఎండలో కూర్చుని బఠాణీలు అమ్ముతోంది. ఈ దృశ్యం పవన్ కౌశిక్ అనే ట్విట్టర్ యూజర్ కంట్లో పడింది. 'ఈ వయసులో ఎండలో కూర్చొని కష్టపడుతోంది' అని జాలిపడి బేరం ఆడకుండా ఆమె దగ్గర ఉన్న బఠాణీల సంచులను హోల్‌సేల్‌గా కొనేశాడు.



ఆమెతో సెల్ఫీ దిగి తన సంతోషాన్ని ట్విట్టర్‌లో షేర్ చేశాడు. 'అమ్మాజీకి సహాయపడినందుకు సంతోషంగా ఉంది' అంటూ రాశాడు.

ఈ ట్వీట్ వైరల్ కావడం మాట ఎలా ఉన్నా యూజర్స్ మాత్రం రెండు వర్గాలుగా చీలిపోయారు. ఒక వర్గం వారు 'చాలా మంచి పనిచేశారు' అని ప్రశంసిస్తే మరో వర్గం మాత్రం 'చేసిన మంచి పని చెప్పుకోకూడదు. పబ్లిసిటీ ఎందుకు!' అంటూ ఘాటుగా విమర్శించారు. ఆ విమర్శలకు పవన్ కౌశిక్ ఇలా స్పందించాడు.. 'నేను చేసింది చాలా చిన్న పని అనే విషయం, ఆ సహాయం వల్ల అమ్మాజీ జీవితం మారదనే విషయం నాకు తెలుసు. అయితే ఈ పని నాకు ఎంతో సంతోషం ఇచ్చింది. ఆ సంతోషాన్ని ఇతరులతో పంచుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది'

అయ్ బామ్మోయి!

సంప్రదాయ దుస్తుల్లో బామ్మలు వీధుల్లో స్కేట్‌బోర్డింగ్ చేస్తున్న చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే ఇది నిజం కాదు. బామ్మలు నిజమే. స్కేట్‌బోర్డింగ్ మాత్రం ఏఐ సృష్టి!



ఆశిష్ జోస్ అనే ఆర్టిస్ట్ ప్రాంప్ట్–బేస్డ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రోగ్రామ్ 'మిడ్‌జర్నీ'ని ఉపయోగించి ఈ చిత్రాలను సృష్టించాడు.

'స్కేటింగ్ నానీ' పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తే మూడు రోజుల వ్యవధిలోనే 1.17 లక్షల వ్యూస్ వచ్చాయి.

'సాహసానికి వయసు అడ్డు కాదు'లాంటి ఎన్నో కామెంట్స్ కనిపించాయి.

జై శ్రీ అన్నా

గతంతో పోల్చితే చిరుధాన్యాల పెద్ద ఉపయోగాల గురించి పల్లె, పట్టణం అనే తేడా లేకుండా విస్తృత అవగాహన పెరిగింది. దీనికి సాక్ష్యంగా నిలిచే వీడియోను ప్రధానమంత్రి నరేంద్రమోదీ షేర్ చేశారు.



'వైబ్రెంట్ విలేజెస్' కార్యక్రమంలో భాగంగా కేంద్రమంత్రి స్మృతి ఇరానీ ఒక గ్రామంలోకి వెళ్లారు.

ఆ గ్రామంలోని ఒక మహిళ మంత్రిగారికి చిరుధాన్యాలతో చేసిన సంప్రదాయ వంటల రుచి చూపించడమే కాదు... జొన్నె రొట్టె నుంచి రాగి లడ్డు వరకు చిరుధాన్యాలు చేసే మంచి గురించి మంచిగా మాట్లాడింది. ప్రధాని ప్రశంస అందుకొంది.

'ప్రతి పల్లెలో ఇలాంటి దృశ్యం కనిపించాలి'... 'క్షేత్రస్థాయి నుంచి మొదలైన స్పృహ, చైతన్యం వేగంగా విస్తరిస్తుంది'... 'కనుల విందు చేసే వీడియో'... ఇలాంటి కామెంట్స్ కనిపించాయి.

స్వీట్‌వాయిస్ చిట్టెమ్మ!

పియానో వాయిస్తూ ఒక మహిళతో కలిసి కన్నడ పాట పాడుతున్న చిన్నారి వీడియో సోషల్ మీడియాలో వీర లెవల్లో వైరల్ అయింది. అనంత్ కుమార్ అనే యూజర్ ఈ వీడియోను ట్విట్టర్‌లో షేర్ చేశాడు. పాడుతున్న సమయంలో చిన్నారి ప్రదర్శించిన హావభావాలకు నెటిజనులు ఫిదా అయ్యారు. 'ఆహా' అంటూ అబ్బురపడ్డారు.



'పక్కనే తీయటి సెలయేరు పారుతున్నట్లుగా ఉంది'

'మ్యాజిక్ వాయిస్ ప్లస్ బ్యూటీఫుల్ ఎక్స్‌ప్రెషన్స్' లాంటి కామెంట్స్ ఎన్నో కనిపించాయి.

నిజానికి ఆన్‌లైన్ ప్రేక్షకులకు ఈ చిన్నారి గొంతు కొత్తేమీ కాదు. గత సంవత్సరం బాలీవుడ్ సినిమా 'కబీర్‌సింగ్' సినిమాలోని 'కైసే హువా' పాటను అద్భుతంగా పాడింది. ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయింది.

పల్లో లట్కే



డ్యాన్సింగ్ వీడియోలు సోషల్ మీడియాలో పాపులర్ కావడం అనేది కొత్త విషయమేమీ కాదు. అయితే అమ్మాయిల బృందం చేసిన ఈ డ్యాన్స్ వీడియో వారం రోజుల వ్యవధిలోనే ఇన్‌స్టాగ్రామ్‌లో 1.1 మిలియన్ వ్యూలను సొంతం చేసుకుంది. 'అసలు కంటే కాపీ ముద్దు' అనే సామెత లేదు గానీ ఈ వీడియో క్లిప్ చూస్తే అలాగే అనిపిస్తుంది.

'షాదీ మే జరూరు ఆనా' అనే హిందీ సినిమాలోని 'పల్లో లట్కే' సాంగ్‌కు ఈ యువబృందం వేసిన స్టెప్పులు 'అహో' అనిపించాయి.

'ఏబీసీడీ డ్యాన్స్ ఫ్యాక్టరీ' ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. 'అప్పుడెప్పుడో పెళ్లిసంబరాల్లో డ్యాన్స్ చేసేదాన్ని. ఈ వీడియో చూస్తుంటే...నా మోకాల నొప్పులను పక్కనపెట్టి డ్యాన్స్ చేయాలని ఉంది' అని కామెంట్ పెట్టింది 69 సంవత్సరాల రాధాబాయి.

వీడియో తెగ వైరల్ అయిందని చెప్పడానికి ఇంతకు మించిన కామెంట్ అక్కర్లేదేమో!

పాటల తుపాకీ...

దేశ సరిహద్దులో బీఎస్ఎఫ్ జవాన్. వేదికల మీద పాటలు పాడుతూ తనలో ఉన్న కళకు హద్దులు లేవని నిరూపిస్తున్నారు. 'డ్యూటీలో ఉంటూ గాన సాధన కూడా చేయడంతో ఈ పాట నాకు బాగా వంట పట్టింది' అంటూ ఇటీవల హైదరాబాద్ వచ్చిన చక్రపాణి నగరి తన గురించి వివరించారు.



చక్రపాణి నగరి

''మాది శ్రీకాకుళం జిల్లా, పలాస. టెన్త్‌క్లాస్ వరకు హైదరాబాద్ హాస్టల్‌లో ఉండి చదువుకున్నాను. ఆ సమయంలో బీఎస్ఎఫ్‌కు సంబంధించిన ఒక ప్రకటన చూసి, అప్లై చేశాను. ఆ పరీక్షల్లో సెలక్ట్ అయ్యి 2013లో బీఎస్ఎఫ్‌లో చేరాను. ఇప్పటి వరకు రాజస్థాన్‌లో పని చేశాను. ఇప్పుడు సెలవు మీద హైదరాబాద్‌కు వచ్చాను. సెలవు పూర్తవగానే జమ్ములో విధులు నిర్వర్తించాలి.

డ్యూటీలో ఉంటూ..

ఏదో ఒకటి పాడుకుంటూ ఉండటం అనేది స్కూల్ టైమ్ నుంచే ఉండేది. కానీ, ఎప్పుడూ దానిని నా డ్రీమ్ ప్రాజెక్ట్ అనుకోలేదు. బీఎస్ఎఫ్‌లో చేరిన తర్వాత అక్కడ మా టీమ్, క్యాంపుల్లో సరదాగా పాడుతుండేవాడిని. నెలకు ఒకసారి ఏదో ఒక సెలబ్రేషన్ ప్రోగ్రామ్ జరుగుతుంటుంది. ఆ సమయంలో అన్నీ హిందీ పాటలు పాడేవాడిని. అక్కడున్నవారందరికీ హిందీ తెలుసు కాబట్టి, అవే పాటలు పాడేవాడిని. మా తోటి జవాన్‌లే కాదు ఆఫీసర్స్ కూడా చాలా ప్రోత్సహించేవారు. డ్యూటీలో ఉన్నా లేకున్నా పాటలు పాడటం మాత్రం ఆగేది కాదు. ఇక మా ఊరికి వచ్చినప్పుడు పెళ్లిళ్ల వంటి వేడుకల సందర్భాల్లోనూ నా గాన కచేరీ ఉండేది. ఖాళీ సమయంలో డిజిటల్ మీడియాని ఫాలో అవుతుంటాను. అలా, హైదరాబాద్‌లోని ఓ టీవీ పాటల కార్యక్రమంలో పాల్గొనవచ్చు అని ప్రకటన చూసి, అప్లై చేసుకున్నాను. వేల మందిలో నాకు అవకాశం రావడంతో చాలా సంతోషంగా అనిపించింది. ఈ విషయాన్ని మా అధికారులకు చెబితే వాళ్లు వెంటనే ఓకే చేశారు. ఇక్కడ కార్యక్రమంలో పాల్గొనడమే కాదు, గాన గంధర్వుడు బాలుగారి మైక్‌ను కానుకగా అందుకోవడం చాలా ఆనందాన్నిచ్చింది.

కష్టపడుతూ..

మా అమ్మానాన్నలకు మేం ముగ్గురం. నా చిన్నప్పుడే నాన్న చనిపోవడంతో మా అమ్మ చాలా కష్టాలు పడింది. మమ్మల్ని హాస్టల్‌లో ఉంచి, తెలిసినవారి ద్వారా ఢిల్లీ వెళ్లి, పనులు చేసి, మాకు డబ్బు పంపేది. ఇప్పుడు అమ్మ ఊళ్లో వ్యవసాయం పనులు చేస్తుంది. అన్నయ్య సొంతగా బేకరీ నడిపిస్తున్నాడు. అక్క గ్రామవాలంటీర్‌గా చేస్తోంది. మాకు కష్టం విలువ తెలుసు, స్వయంగా ఎదగడానికి మా వంతుగా కృషి చేస్తూనే వచ్చాం. ఆ కష్టంలో నుంచే ఈ పాట పుట్టుకు వచ్చిందనుకుంటాను. ఎక్కడ ఉన్నా కళ రాణిస్తుందనడానికి నేనే ఉదాహరణ అనిపిస్తుంటుంది. మరిన్ని కార్యక్రమాల్లో పాల్గొని సింగర్‌గా రాణించాలనుకుంటున్నాను'' అని తెలియజేశాడు ఈ జవాన్.

– నిర్మలారెడ్డి

హెల్త్

బోన్ మ్యారో ఫెయిల్యూర్?



ఎర్ర రక్తకణాలు, తెల్లరక్త కణాలు, ప్లేట్‌లెట్లు... ఇలా రక్తంలోని కీలక కణాలకు పుట్టినిల్లు మూలుగ! కానీ అన్ని అవయవాల లాగే ఇది కూడా విఫలం కావచ్చు. హార్ట్ ఫెయిల్యూర్, కిడ్నీ ఫెయిల్యూర్, లివర్ ఫెయిల్యూర్ లాగే బోన్ మ్యారో ఫెయిల్యూర్ కూడా జరగవచ్చునన్న మాట. ఈ ఫెయిల్యూర్‌ను వైద్యపరిభాషలో 'అప్లాస్టిక్ అనిమియా' అంటారు. గతంలో కాస్త అరుదే అయినా ఇటీవల ఈ కేసులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బోన్ మ్యారో ఫెయిల్యూర్ మీద అవగాహన కోసం ఈ కథనం.

నిజానికి మూలుగ వైఫల్యం కూడా ఓ ఆటో ఇమ్యూన్ డిసీజ్. అంటే మన సొంత రోగనిరోధక శక్తి మన సొంత కణాలపై ప్రతికూలంగా ఏర్పడటం వల్ల వచ్చే వ్యాధి. దాంతో మూలుగ ప్రభావితమై, రక్తంలోని కణాల పుట్టుక, ఆరోగ్యకరమైన పెరుగుదల దెబ్బ తింటుంది. ఫలితంగా ఎర్ర, తెల్ల రక్తకణాలు, ప్లేట్‌లెట్ల కౌంట్ నార్మల్‌గా ఉండక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. 'అప్లాస్టిక్ అనిమియా' కండిషన్ ఏ వయసువారిలోనైనా, ఎప్పుడైనా రావచ్చు. సాధారణంగా చిన్న పిల్లల్లోనే ఎక్కువగా కనిపిస్తుంది. ఆసియావాసుల్లో అందునా మన దేశంలోనే ఈ కేసులు ఎక్కువ. దాదాపు 75 శాతం కేసుల్లో కారణాలు తెలియదు. అయితే మిగతా 25% కేసుల్లో ఈ కింది అంశాలు కారణం కావచ్చు.

కారణాలు : ● క్రిమిసంహారక మందులకు, ఆర్సెనిక్, బెంజీన్ వంటి విషపదార్థాలకు గురికావడం ● కొన్ని సందర్భాల్లో రేడియేషన్, కీమోథెరపీతో కూడా రావచ్చు ● రుమటాయిడ్ ఆర్థరైటిస్ లేదా లూపస్ వంటి ఆటోఇమ్యూన్ జబ్బులకు తీసుకుంటున్న చికిత్సల వల్ల కూడా రావచ్చు ● హెపటైటిస్, కొన్ని ఇతర అరుదైన వైరస్‌లు ఎముక మజ్జ అణచివేతతో పాటు వైఫల్యానికి కారణం కావచ్చు ● హెపటైటిస్, ఎప్‌స్టెయిన్ బార్ వైరస్, సీఎంవీ వైరస్, పర్‌వైరస్ బి19 లేదా హెచ్ఐవీ వంటి సాంక్రమిక (ఇన్ఫెక్షియస్) వ్యాధుల తర్వాత కనిపించవచ్చు ● కొందరిలో వంశపారంపర్యంగా కూడా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు రావచ్చు. (ఇలా వంశపారంపర్యంగా ఈ జబ్బు వచ్చినప్పుడు మూలుగ మార్పిడి చికిత్స (బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్) ఒక్కటే తగిన చికిత్స) ● మైలోడిస్‌ప్లాస్టిక్ సిండ్రోమ్ : ఇది రక్తానికి చెందిన ఒక రకం క్యాన్సర్‌కు ముందు దశ. ఈ సమస్య రాబోయే కొందరిలో ఇది హైపోసెల్యులార్ బోన్ మ్యారో అనే కండిషన్ (అంటే రక్తంలో ఉండే కణాల సంఖ్య తగ్గుదల)తో కనిపించవచ్చు ● పరోక్సిస్మల్ నాక్టర్నల్ హీమోగ్లోబినూరియా (పీఎన్‌హెచ్) : మన మూలుగలో ఉండే కణాల్లోంచి తొలుత మూల కణాలు (స్టెమ్‌సెల్స్) పుడతాయి. అవి నిర్దుష్టంగా ఏయే కణాలు అంటే... ఎర్రరక్తకణాలు, తెల్లరక్తకణాలు, ప్లేట్‌లెట్లు ఏయే పరిమాణాలతో ఎంత ఉండాలో అన్నిగా మారిపోతుంటాయి. కానీ 'పైగా' (పీఐజీ-ఏ) అనే ఓ జీన్ మ్యుటేషన్ (జన్యు ఉత్పరివర్తనం) కారణంగా రక్తకణాల్లో ఉండాల్సిన ఓ ప్రోటీన్ లోపించడంతో ఎర్రరక్తకణాలు విరిగిపోయినట్లుగా అవుతాయి. ఈ పరిణామాలు జరిగినప్పుడు ఎముక మజ్జలోని మూలకణాలు కూడా నాశనం అవుతాయి.

లక్షణాలు : అప్లాస్టిక్ అనిమియాతో ఎర్రరక్తకణాల సంఖ్య బాగా తగ్గుతుంది. ఫలితంగా ఈ కింది పరిణామాలు సంభవిస్తుంటాయి... ● ఎప్పుడూ నీరసం, నిస్సత్తువ ● చురుకుదనం లోపించడం, దేని పైనా దృష్టి కేంద్రీకరించలేకపోవడం ● ఆకలి తగ్గడం, బరువు తగ్గడం ● బాగా పాలిపోయినట్లుగా ఉండటం ● చిన్న చిన్న పనులకూ తీవ్రంగా ఆయాసం, గుండె వేగం పెరగడం ● మెట్లు ఎక్కలేకపోవడం. చిన్నపాటి వ్యాయామాలకూ తీవ్రంగా ఆయాసం ● చిన్నపాటి గాయం అయినా, తీవ్రమైన రక్తస్రావం ● తరచూ ఇన్ఫెక్షన్లతో పాటు జ్వరం

తెల్లరక్తకణాలు తగ్గడం వల్ల...

ఈ కండిషన్‌ను 'న్యూట్రోపీనియా' అంటారు. తెల్లరక్తకణాలు మన లోని వ్యాధినిరోధక శక్తికి తోడ్పడి ఇన్ఫెక్షన్లతో పోరాడతాయి. వాటి సంఖ్య తగ్గడం వల్ల తేలిగ్గా ఇన్ఫెక్షన్ల బారిన పడటం, తరచూ జ్వరం రావడం వంటి పరిణామాలు ఏర్పడతాయి. ముఖ్యంగా మూత్రకోశం (బ్లాడర్) ఇన్ఫెక్షన్లకు గురి కావడం, మూత్రంతో మంట, మూత్రవిసర్జనలో నొప్పి, తరచూ ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో కష్టం, నోటిలో పుండ్లు, సైనస్ సమస్య, ముక్కు దిబ్బడ, చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్లు కనిపిస్తుంటాయి. అప్లాస్టిక్ అనిమియా ఉన్నవారిలో జ్వరం చాలా తీవ్రమైన సమస్యగా పరిణమించవచ్చు. చికిత్స చేయకపోతే ప్రాణాపాయం కావచ్చు.

ప్లేట్‌లెట్స్ తగ్గడం వల్ల... : ఏదైనా గాయం అయినప్పుడు రక్తస్రావాన్ని నిరోధించడానికి రక్తం గడ్డకట్టే ప్రక్రియకు ప్లేట్‌లెట్స్ తోడ్పడతాయన్న విషయం తెలిసిందే. అందుకే ఇవి లోపించినప్పుడు రక్తస్రావం ముప్పు ఏర్పడుతుంది. ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గే కండిషన్‌ను 'థ్రాంబోసైటోపీనియా' అంటారు. దీనివల్ల చిన్న చిన్న గాయాలకే తీవ్రమైన రక్తస్రావం, ముక్కు నుంచి రక్తస్రావం, చర్మం కింది పొర లో రక్తపు చుక్కల్లా ఎర్రమచ్చల్లాంటివి కనిపించడం, బ్రష్ చేసుకుంటున్నప్పుడు చిగుర్లు ఏమాత్రం దెబ్బతిన్నా తేలిగ్గా రక్తం వస్తుండటం, ఇక మహిళల్లోనైతే పీరియడ్స్ సమయంలో విపరీతమైన రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ప్లేట్‌లెట్స్ తగ్గిపోయినప్పుడు అంతర్గత రక్తస్రావం కూడా కనిపించవచ్చు. ఈ కేసులో రక్తస్రావం కూడా ఓ మెడికల్ ఎమర్జెన్సీగా పరిగణించాలి. బయట రక్తస్రావం అవుతుంటే హాస్పిటల్‌కు చేరేవరకు రక్తస్రావాన్ని ఆపడానికి ప్రయత్నించాలి.



డా॥ గూడల స్థితప్రజ్ఞ
కన్సల్టెంట్ క్లినికల్ హెమటాలజీ & హెమటో ఆంకాలజీ అండ్ బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్

నిర్ధారణ: సరైన చికిత్స కోసం సమస్య ను సరిగ్గా నిర్ధారణ చేయడం అవసరం. ఇందుకు కంప్లీట్ బ్లడ్ పిక్చర్ వంటి రొటీన్ బ్లడ్ వర్కప్స్, కిడ్నీ ఫంక్షన్ పరీక్ష, బోన్ మ్యారో పరీక్షలు తోడ్పడతాయి.

చికిత్స : – చాలా స్వల్పమైన లేదా ఓ మోస్తరుగా ఉన్న అప్లాస్టిక్ అనిమియా బాధితుల్లో వారికి ఎలాంటి సమస్యా లేకపోతే తక్షణం పెద్దగా చికిత్స ఏదీ అవసరం ఉండదు. కానీ తీవ్రత చాలా ఎక్కువగా ఉన్న అప్లాస్టిక్ అనిమియా బాధితుల్లో మాత్రం ముమ్ముందు రాబోయే దుష్పరిణామాలను నివారించడం కోసం చికిత్స అవసరం. ఇలాంటివారికి తరచూ రక్తం ఎక్కిస్తుండటం (బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్), జ్వరం, ఇన్ఫెక్షన్లు ఉన్నప్పుడు యాంటీబయాటిక్స్ ఇవ్వడం, ఫంగల్ ఇన్ఫెక్షన్లను నివారించేందుకు యాంటీ ఫంగల్ మందులు ఇవ్వడం అవసరం.

ఇమ్యూనో సప్రెసివ్ థెరపీ : మన రోగనిరోధక వ్యవస్థ అతి చురుగ్గా మారి సొంత కణాలపై ప్రతికూలంగా పనిచేస్తున్నందున ఈ సమస్య వస్తుంది కాబట్టి... ఆ ఇమ్యూనిటీ చురుకుదనాన్ని తగ్గించే ఏటీజీ, సైక్లోస్పోరిన్ వంటి వాటిని ఉపయోగించి కూడా ఈ సమస్యకు చికిత్స అందిస్తారు.

స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంట్: ఈ చికిత్సలో అనారోగ్యకరమైన / సమస్యాత్మకమైన మూలుగ స్థానంలో ఇతరుల నుంచి (తమకు సరిపడే విధంగా / మ్యాచ్ అయ్యే విధంగా) ఉన్న ఆరోగ్యకరమైన దాత రక్తం నుంచి సేకరించిన మూలకణాలు మార్పిడి చేస్తారు. ఇమ్యూనో సప్రెసివ్ థెరపీ లేదా ఇతరత్రా చికిత్సలు పనిచేయనప్పుడు, ఇదే మంచి ప్రత్యామ్నాయం. అయితే ఇందుకు దాత నుంచి సేకరించే మూల కణాలు జన్యుపరంగా స్వీకర్తతో సరిపోలాల్సి ఉంటుంది. అందుకే కుటుంబ సభ్యుల నుంచి సేకరించే మూలకణాలకు మొదటి ప్రాధాన్యం. ఇతరుల నుంచి సేకరించినప్పుడు అందులోని చాలా అంశాలు మ్యాచ్ కావాల్సి ఉంటుంది. అయితే ఇదొక సంక్లిష్టమైన ప్రక్రియ. ఇందుకోసం హాస్పిటల్‌లో నిపుణులైన డాక్టర్ల పర్యవేక్షణలో చికిత్స అవసరమవుతుంది. చికిత్స సమయంలో ఇన్ఫెక్షన్లు, ఇతరత్రా చాలా సమస్యలు వచ్చే అవకాశం ఉండటంతో ఈ సైడ్‌ఎఫెక్ట్స్ గురించి స్టెమ్‌సెల్ మార్పిడి నిపుణులతో చర్చించాకే ఈ చికిత్సకు వెళ్లాల్సి ఉంటుంది.

సరికొత్త చికిత్స ప్రక్రియలు : పైన పేర్కొన్న చికిత్సలే కాకుండా ఇప్పుడు మరింత అత్యాధునికమైన 'ఎల్ట్రాంబోప్యాగ్', 'రోమిప్లాటిజమ్' వంటి నూతన చికిత్సలూ– అందుబాటులోకి వచ్చాయి. మూలుగ మార్పిడి చికిత్సకు అంత అనుకూలం కాని వారిలోనూ, ఇమ్యునోసప్రెసివ్ చికిత్సలకు అంతగా స్పందించని వారిలోనూ ఇవి మంచి ఫలితాలను తెస్తున్నాయి.

ఆహారంలో మార్పులతోనే నోటి దుర్వాసనకు అడ్డుకట్ట!



నోటి దుర్వాసనను వైద్యపరిభాషలో హాలిటోసిస్ అంటారు. మధుమేహం, గ్యాస్ట్రో ఇంటస్టినల్ జబ్బుల్లా అండర్‌లైయింగ్ డిసీజెస్ ఏవీ లేనప్పుడు కేవలం కొన్ని ఆహారాలు, ఆహారాల్లో మార్పులతో నోటి దుర్వాసన తగ్గించుకోవచ్చు. అదెలాగో చూద్దాం.

మన ఆహారంలో ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండేలా చూసుకోవడం, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు సమృద్ధిగా తీసుకోవడం, ద్రవపదార్థాలు ఎక్కువగా తాగడం వల్ల నోటి దుర్వాసనను అదుపు చేసుకోవచ్చు. పండ్లు, కూరగాయలు, ఆకుకూరల్లోని పీచు పదార్థాలు గ్యాస్ట్రో ఇంటస్టినల్ మార్గాన్ని ఆరోగ్యంగా, శుభ్రంగా ఉంచుతాయి. ముఖ్యంగా ఆపిల్స్, క్యారట్స్ వంటి పీచు పదార్థాలు సమృద్ధిగా ఉన్న పండ్లు, కూరగాయలు నమిలి తినే ప్రక్రియలో అవి పళ్లను శుభ్రం చేస్తాయి. వీటిని తినడం వల్ల లాలాజలం ఎక్కువగా విడుదలై నోటిని శుభ్రంగా ఉంచుతుంది. తాజా పెరుగు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల నోటి దుర్వాసనకు కారణమైన హైడ్రోజెన్ సల్ఫైడ్ అదుపులోకి వస్తుంది. చిగుళ్ల వ్యాధులూ తగ్గుతాయి.

మరికొన్ని చిట్కాలు... నోటి దుర్వాసనను అరికట్టడంలో కొత్తిమీర, పుదీనా, యాలక్కాయ వంటివి బాగా పని చేస్తాయి. ఆహారంతోపాటు లేదా నేరుగా వాడటం వల్ల కూడా నోటి దుర్వాసన తగ్గుతుంది. వాటిని నీటిలో మరిగించి ఆ టీని తాగడం వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగవుతుంది. దాంతో నోటి దుర్వాసన తగ్గిపోతుంది. పాటించాక కూడా తగ్గకపోతే దంతాలు, చిగుర్లకు సంబంధించిన సమస్యగానీ, డయాబెటిస్ వంటి వ్యాధులు ఏమైనా ఉన్నాయేమో తెలుసుకునేందుకు ఒకసారి డాక్టర్‌ను సంప్రదించడం మంచిది.

బ్లడ్ గ్రూపులు కలవకపోయినా కిడ్నీ మార్పిడి సాధ్యమే!

మూత్రపిండాలు నూరు శాతం పాడైపోయినప్పుడు కిడ్నీ మార్పిడి తప్ప మరొక ప్రత్యామ్నాయం ఉండదు. అయితే ఒక మూత్రపిండం ఉన్నప్పటికీ జీవితాంతం ఆరోగ్యంగానే బతకవచ్చు. కాబట్టి ప్రభుత్వాలు నిర్దేశించిన మేరకు దగ్గరి బంధువులైన కొందరి నుంచి కిడ్నీ స్వీకరించడానికి అనుమతి ఉంటుంది.

కిడ్నీని రెండు రకాలుగా స్వీకరించడం సాధ్యమవుతుంది. మొదటివి లైవ్ డోనార్ నుంచి. అంటే బతికి ఉన్న దగ్గరి బంధువుల నుంచి సేకరిస్తారు. ఇక రెండోది కెడేవర్ డోనార్... అంటే ఏదైనా ప్రమాదానికి గుర్త్రెనవారి దేహం బతికి ఉండి, మెదడు చనిపోయిన వ్యక్తుల నుంచి అవయవాలు సేకరించినప్పుడు ఆ దాతను 'కెడేవర్ డోనార్'గా చెబుతారు. లైవ్ డోనార్స్ విషయంలో రక్తసంబంధీకులు మాత్రమే కిడ్నీని స్వీకరించే సమయంలో రక్తపరీక్షలు చేస్తారు. అయితే ఎంత దగ్గరి బంధువులైనప్పటికీ దాత, స్వీకర్తల బ్లడ్ గ్రూపులు కలిసినప్పుడే (మ్యాచ్) అయినప్పుడే కిడ్నీ ఇవ్వడం, తీసుకోవడం సాధ్యమవుతుంది. అంతేకాదు... కిడ్నీ దానం చేసేవారికి హైబీపీ, మధుమేహం (డయాబెటిస్), గుండెజబ్బులు, మెదడుకు సంబంధించిన జబ్బులు, కాలేయవ్యాధులైన హెపటైటిస్–బి, సి ఉండకూడదు. తన కిడ్నీ దానం చేసినప్పటికీ దాతకు ఎలాంటి నష్టం ఉండదని నిర్ధారణ చేశాకే కిడ్నీ మార్పిడి చేస్తారు.



అయితే రక్తసంబంధీకుల బ్లడ్ గ్రూపులు కలవకపోతే రెండు మార్గాలు ఉన్నాయి. ఇప్పుడు వైద్యశాస్త్రంలో వచ్చిన ఆధునిక పురోగతి వల్ల బ్లడ్ గ్రూపులు కలవకపోయినప్పటికీ కిడ్నీ ఇవ్వవచ్చు. ఇది రెండు రకాలుగా జరుగుతుంది.

మొదటిది... స్వాప్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్, రెండోది ఏబీఓ ఇన్ కంపాటబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్.

స్వాప్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్: ఇందులో రక్త సంబంధీకులకు కిడ్నీ దానం చేయాలని ఉన్నప్పటికీ... దాత, స్వీకర్తల బ్లడ్ గ్రూపులు కలవకపోవడం వల్ల అది సాధ్యపడనప్పుడు... అదే సమస్యతో బాధపడుతున్న వేరొకరి రక్త సంబంధీకులలో బ్లడ్ గ్రూపు సరిపడితే... వారి నుంచి కిడ్నీ స్వీకరించవచ్చు. ఇలా స్వీకరించినవారి రక్తసంబంధీకులు మళ్లీ వారికి తమ బంధువుల నుంచి కిడ్నీ ఇవ్వాల్సి ఉంటుంది. అంటే... రక్తసంబంధీకులే కిడ్నీ ఇస్తారు గానీ... కేవలం బ్లడ్‌గ్రూపులు కలవకపోవడం చేత... ఇరువర్గాలు వారు ఎదుటివారికి కిడ్నీ ఇచ్చి పుచ్చుకుంటారు. ఈ విధానంలో వీరి కిడ్నీని వారి బంధువుకూ, వారి కిడ్నీని వీరి బంధువుకు అమర్చే ఏర్పాటు చేస్తారన్న మాట. అంటే తమ బంధువుకు సరిపడని గ్రూపు ఎదుటివారికి సరిపడనప్పుడు ఇలా చేస్తారు. ఈ ప్రక్రియలో బాధితులిద్దరి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స ఒకేసారి జరుగుతుంది. ఈ ప్రక్రియను 'స్వాప్ ట్రాన్స్‌ప్లాంటేషన్' అంటారు.

ఇన్‌కంపాటబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్: బ్లడ్ గ్రూపులు కలవనప్పటికీ ఇప్పుడున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కిడ్నీ మార్పిడి చేయడం వీలవుతుంది. అయితే ఈ ప్రక్రియ కోసం కొన్ని నిర్దుష్టమైన పద్ధతులూ, కొన్ని ప్రత్యేకమైన మందుల్ని ఉపయోగించాల్సి ఉంటుంది. ఇలా బ్లడ్‌గ్రూపు సరిపడకపోయినప్పటికీ జరిగే కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్ని 'ఇన్‌కంపాటబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్' అంటారు. దీనిమీద ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయి. అయితే ఎలాంటి కిడ్నీ మార్పిడి అయినప్పటికీ... అది ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు, సూచనలకు అనుగుణంగానే జరగాల్సి ఉంటుంది.